క్లుప్తంగా

నెల్లూరులో కంటైనర్ సబ్‌స్టేషన్



మొక్కను నాటుతున్న సంతోష్‌రావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో అత్యాధునిక పరిజ్ఞానంతో కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నామని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు పేర్కొన్నారు. ఎన్టీఆర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం మొక్కను నాటారు. గాం. దీబొమ్మ సెంటర్ వద్ద నూతనంగా నిర్మించనున్న కంటైనర్ సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో నూతనంగా 100 సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.మూడు కోట్ల చొప్పున మొత్తం రూ.300 కోట్లు వెచ్చిస్తున్నామని వెల్లడించారు. కాలం చెల్లిన స్తంభాల స్థానంలో రూ.20 కోట్లతో నూతన స్తంభాలు, నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు గురవయ్య, . ధర్మజ్ఞాని, ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు

నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభంకానున్నాయి. అంకురార్పణను శనివారం, తీర్థవాదిని జూలై నాలుగున నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

వైఎస్సార్సీపీ లీగల్ సెల్ సమావేశం



నెల్లూరు(లీగల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు, కో ఆర్డినేటర్లతో సమావేశాన్ని విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పార్టీ కో ఆర్డినేటర్, న్యాయ విభాగాల ఇన్‌చార్జి విజయసాయిరెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని జరిపారు. పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు యల్లసిరి మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో కుష్టు నివారణ

కొడవలూరు: ప్రాథమిక దశలోనే కుష్టును పూర్తిగా నివారించవచ్చని లెప్రసీ నోడల్ ఆఫీసర్ నరసారెడ్డి తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని రాగి రంగు మచ్చలుంటే కుష్టు లక్షణాలుగా గుర్తించాలన్నారు. అదేవిధంగా ముఖంపై బొబ్బర్లు ఉన్నా కుష్టు లక్షణాలుగా పరిగణించి పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి ముదరడం వల్ల నివారణ కష్టతరంగా మారడంతో పాటు కాలవ్యవధి పట్టే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో పర్యటించే వైద్య సిబ్బంది ఏ మాత్రం అనుమానం ఉన్నా వెంటనే పీహెచ్‌సీలో పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

తోటపల్లిగూడూరు : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, పోక్సో చట్టం , గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ అనే అంశాలపై కోడూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థులకు ఎస్‌ఈబీ అధికారులు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ సీఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకొంటున్నారని తెలిపారు. వీటి విషయంలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉన్నతంగా చదివి తల్లిదండ్రుల కీర్తి ప్రతిష్టలను కాపాడాలని కోరారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక కళాశాల ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ, మహిళా పోలీసులు నికిత, శ్రావణి, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించనున్నామని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. 26వ డివిజన్లోని చంద్రమౌళీనగర్, టీచర్స్ కాలనీల్లో డ్రెయిన్, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనను శుక్రవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. డివిజన్‌కు రూ.1.2 కోట్లను కేటాయించామని చెప్పారు. రూరల్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లకు రూ.ఐదు కోట్లను కేటాయించాలని కోరిన వెంటనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారని చెప్పారు. రూరల్ పరిధిలోని ప్రాంతాల్లో లేఅవుట్లు వేసేవారు మౌలిక వసతులను ముందుగా పూర్తి స్థాయిలో కల్పిస్తేనే అనుమతులు లభించేలా చర్యలు చేపడతామని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రాంతాల్లో ఎనలేని విధంగా అభివృద్ధి జరుగుతోందని, అయితే అభివృద్ధి లేదంటూ టీడీపీ నేతలు ప్రచారం చేయడం అర్థరహితమని తెలిపారు. పలు సమస్యలను స్థానికులు తెలియజేయగా, పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు.

పవన్ కల్యాణ్‌కు రాజకీయ జ్ఞానం ఉందా..?

• ధ్వజమెత్తిన సీపీఐ నేతలు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు (వేదాయపాళెం): జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు రాజకీయ జ్ఞానం ఏమైనా ఉందానని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ సిరాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్ విమర్శించారు. ఆజాద్ సెంటర్‌లోని ఇన్సాఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం వారు మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న పవన్ కల్యాణ్ బీజేపీ తన మిత్రపక్షమని, ముస్లింలు తనతో కలవకపోతే నష్టపోతారని చెప్పడం హాస్యాస్పదమన్నారు. గత ఎన్నికల్లో రెండు చోట్ల ఓడిపోయిన ఈయన ముస్లింలకు అండగా ఉంటాననడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ లేదా బీజేపీతో పొత్తా.. లేక ఒంటరిగా పోటీ చేస్తారాననే అంశం ప్రజలకు అర్థం కావడంలేదని చెప్పారు. ఇష్టమొచ్చినప్పుడు రాజకీయాల్లోకి రావడం.. లేకపోతే సినిమాలు చేసుకోవడం పవన్ కల్యాణ్ నైజమన్నారు. ముస్లింల జోలికొస్తే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు షానవాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి అహ్మద్, గోపాల్, లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

నెల్లూరు (వేదాయపాళెం): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. జేమ్స్ గార్డెన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘ వర్క్‌షాపులో వారు మాట్లాడారు. కరోనా అనంతరం బాడుగల్లేక.. ఆటోల కిస్తీలు కట్టలేక.. కుటుంబాన్ని పోషించుకోలేక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రవాణా రంగంలో కార్మిక వర్గానికి ప్రభుత్వ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి సురేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఆటో కార్మిక సంఘ జిల్లా నేతలు మారుబోయిన రాజా, నాగూర్, సుధాకర్, జిల్లా ట్రెజరర్, వెంగయ్య, మురళి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): కలెక్టర్ హరినారాయణన్‌ను నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. నెల్లూరు రూరల్ మండలంలోని కొమ్మరపూడి రైతుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం ఎంపీ మాట్లాడారు. ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న లే అవుట్లకు అవసరమైన భూములను కొమ్మరపూడి రైతుల నుంచి సేకరించారని చెప్పారు. 65 మందికి నష్టపరిహారం రావాల్సి ఉందనే అంశాన్ని రైతులు తనకు తెలియజేశారన్నారు. కాగా పరిహారాన్ని అందజేసేలా చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీసునంద, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వేలూరు శ్రీధర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, యాకసిరి శరత్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు అవకాశం కల్పించరూ..

నెల్లూరు (అర్బన్): సాధారణ డిగ్రీ, బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు ఏపీపీఎస్సీ పరీక్షలకు అవకాశం కల్పించాలని ఎమ్మెస్‌డబ్ల్యూ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మస్తానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఆలోచించి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నెల్లూరు(బృందావనం): నవాబుపేటకు చెందిన చిన్నారి భవ్యహాసిని తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరుని సన్నిధిలో జూలై 16న ఐదు గంటల పాటు నాట్య ప్రదర్శనతో చేపట్టనున్న గిరి ప్రదక్షిణ విజయవంతం కావాలని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి కాంక్షించారు. సాధనలో భాగంగా నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో నాట్య ప్రదర్శనను భవ్యహాసిని శుక్రవారం నిర్వహించారు. తొలుత కళాదీప్తి చిన్నారులు వేద అక్షయ, హనీష, గ్రీషిత, దేదీప్య, విశ్వతేజ, పర్ణిక, హాస్విక, శుభాంజలి, రీతు రాయల్‌తో నృత్య ప్రదర్శనతో అలరించారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీకి గురైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని ఎంజీబీ మాల్ బయట సరస్వతీనగర్‌కు చెందిన శివశంకర్ తన హీరో స్ప్లెండర్ బైక్‌ను ఈ నెల 19వ తేదీ రాత్రి నిలిపారు. అనంతరం వచ్చేసరికి బైక్ అదృశ్యమైంది. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాటలు, డ్యాన్స్ పోటీలు రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): బయ్యా వెంకటరమణయ్య, సరోజనమ్మ స్మృత్యర్థం నగరంలోని పురమందిరంలో కళానీరాజనాన్ని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్నామని నిర్వాహకులు పెంచలరెడ్డి, రఘురామిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిర ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. పాటలు, డ్యాన్స్ పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేయనున్నామని వివరించారు. పలువురు సీనియర్ గాయకులతో సంగీత విభావరి, కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. మల్లికార్జున, రమణయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఏర్పాటుకు సహకరించాలని వినతి

నెల్లూరు(బృందావనం): రూరల్ పరిధిలో రోటరీ క్లబ్ రెండో శ్మశాన వాటిక ఏర్పాటుకు సహకరించాలని రోటరీ క్లబ్ నెల్లూరు అధ్యక్షుడు కొండా శేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. కాగా ఈ అంశమై ఎంపీ సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు.

విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగ మందిర ప్రాంగణంలో గురుపూర్ణిమ ఉత్సవాలను జూలై రెండు, మూడున నిర్వహించనున్నామని గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మందిర ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. గురుపూర్ణిమ సందర్భంగా జూలై మూడున ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, గురుపాదుకాభిషేకం, క్షీరాభిషేకం, వ్యాసపూజ, సత్సంగం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. వివరాలకు 94415 48655 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సురేష్, శ్రీనివాసులురెడ్డి, ట్రస్టీలు మస్తాన్‌రెడ్డి, ప్రవీణ్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాల చెరువు వద్ద పారిశుధ్య పనులు



నెల్లూరు(బారకాసు): స్వర్ణాల చెరువులో పారిశుధ్య పనులను శుక్రవారం చేపట్టారు. ఘాట్ వద్ద గుర్రపు డెక్క, చెత్తను తొలగించారు. వీటిని పరిశీలించిన అనంతరం మేయర్ స్రవంతి మాట్లాడారు. బక్రీద్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రార్థనలు చేసేందుకు వచ్చే ముస్లింలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పారిశుధ్య పనులను చేపట్టామని వివరించారు.

జెడ్పీ వాకర్స్‌కు సన్మానం



నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను శుక్రవారం సత్కరించారు. నిండు నూరేళ్ల వర్ధిల్లు కార్యక్రమంలో భాగంగా ఈ నెల్లో జన్మించిన సభ్యులను సన్మానించారు. కొండారెడ్డి, సత్యనారాయణ, నరసింహులు, వాకర్స్ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, ప్రసాద్, కృష్ణయ్య, ఎస్తేరురాణి, హరిసుధ, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నెల్లూరు రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మాదరాజుగూడూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి సరళకుమారి పేర్కొన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. యోగా సాధనతో ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. అనంతరం విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మజాకుమారి, పీఈటీ సురేఖ, ఏఎస్‌ఎం శేషమ్మ, యోగా శిక్షకులు శిరీష, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి



నెల్లూరు(మినీబైపాస్): జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని బీజేపీ నేతలు శుక్రవారం నిర్వహించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, మిడతల రమేష్, మండ్ల ఈశ్వరయ్య, దాసరి రాజేంద్ర, కందికట్ల రాజేశ్వరమ్మ, మధు, కుడుముల గిరికుమార్‌గౌడ్, చిలకా ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నమ్మకంగా ఉంటూ ఆభరణాలు దోచేసి..

నెల్లూరు(క్రైమ్): ఇంటి యజమానులతో ఓ మహిళ నమ్మకంగా ఉంటూ ఆభరణాలను దోచేసిన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. గౌడ హాస్టల్ సెంటర్‌లో నివాసం ఉంటున్న శివప్రసాద్‌రావు ఇంట్లో ఓ మహిళ ఏడు నెలల క్రితం అద్దెకు చేరారు. శివప్రసాద్‌రావు దంపతులతో ఆమె ఎంతో సన్నిహితంగా ఉండేవారు. శివప్రసాద్‌రావు భార్య తన బంగారు ఆభరణాలను కప్‌బోర్డులో ఏప్రిల్‌లో పెట్టడాన్ని సదరు మహిళ గమనించారు. మరుసటి రోజు మార్నింగ్ వాక్‌కు దంపతులు వెళ్లగా, కప్‌బోర్డులో ఉంచిన రూ.3.5 లక్షల విలువజేసే బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. దీంతో సదరు మహిళపై బాధితులకు అనుమానం వచ్చింది. పెద్దల సమక్షంలో నిలదీయగా, తానే వాటిని అపహరించానని, త్వరలోనే వాటిని తిరిగిచ్చేస్తానని చెప్పారు. రోజులు గడుస్తున్నా ఆభరణాలను తెచ్చివ్వకపోవడంతో పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, స్తంభాలు, లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- డీఎస్సార్ సబ్‌స్టేషన్లో గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇండోర్ సబ్‌స్టేషన్‌కు మార్చనున్న నేపథ్యంలో జెడ్పీ కాలనీలోని 1, 2వ వీధులు, పొదలకూరు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 11 వరకు సరఫరా ఉండదని చెప్పారు.
- శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో బంగ్లాతోట, నాగేంద్రనగర్, వెంగమాంబ సెంటర్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.
- రంగనాథ సబ్‌స్టేషన్లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న తరుణంలో కపాడిపాళెం, రైల్వేఫీడర్స్ రోడ్డు, ఆర్టీఏ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా ఉండదన్నారు.
- నవాబుపేట మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్లో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఎఫ్‌సీఐ ఫీడర్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, నజీర్‌తోట, షిరిడీసాయినగర్, పుల్లమ్మసత్రం, కృష్ణనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.
- కొండాయపాళెం సబ్‌స్టేషన్లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో సంఘమిత్ర ఫీడర్ పరిధిలో గల కొండాయపాళెం, స్నేహనగర్, కావేరి అవెన్యూ, వనంతోపు, బ్యాంక్ కాలనీ, షార్‌కాలనీ, అనగుంట, యాంబర్‌వుడ్ స్కూల్, బీవీనగర్, సంఘమిత్ర కళాశాల, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.
- గోమతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సర్వేపల్లి కాలువకట్ట ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సర్వేపల్లి కాలువకట్ట, హరనాథపురం ఎక్స్‌టెన్షన్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.
- రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మిలీనియం ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో రామ్మూర్తినగర్, మినీబైపాస్ రోడ్డు, శ్రీనివాసాగ్రహారం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని చెప్పారు.
- డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా ఫతేఖాన్‌పేట, రైతుబజార్, డైకస్ రోడ్డు, చిన్నబజార్, పెద్దబజార్, తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.